# ప్రజా మారుతి

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల   సంపుటి : 07   సంచిక : 20   ఆదివారం   13 - 09 - 2026   పేజీలు : 04   వెల రూ. 2




తెలంగాణలో ఆగని వానలు. మరో వారం పాటు వర్ష సూచన



### వినాయక మండపాలకు
## ఉచిత విద్యుత్

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- గణేశ్ ఉత్సవాలపై సమీక్ష నిర్వహించిన రేవంత్ రెడ్డి
- మండపాల నిర్వాహకులు పోలీస్ స్టేషన్లలో సమాచారం ఇవ్వాలని సూచన
- నిమజ్జనాలు చేసే చెరువుల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశం

**హైదరాబాద్ :**

వినాయక చవితి ఉత్సవాలను ఎక్కడా చిన్నపాటి అవాంఛనీయ సంఘటనకూ తావులేకుండా, వైభవంగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. - మిగతా 2 లో

# హైదరాబాద్‌ను బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- మంత్రి శ్రీధర్‌బాబు
- హైదరాబాద్‌కు సంబంధించిన క్యూర్-2026 బిల్లును మంత్రి శ్రీధర్ బాబు శాసనసభలో ప్రవేశపెట్టారు
- రాబోయే 30 ఏళ్ల అవసరాల దృష్ట్యా మరింత సమర్థంగా పాలన కోసం క్యూర్ చట్టం తీసుకువస్తున్నామని స్పష్టం చేశారు.
- బెంగుళూరు, ముంబై, ఢిల్లీ మాదిరిగా హైదరాబాద్ మహా నగరపాలిక సంస్థ చట్టంలో సెక్షన్లు తగ్గించే ప్రణాళిక



**హైదరాబాద్ :**

కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లు-2026ను మంత్రి శ్రీధర్‌బాబు శాసన సభలో ప్రవేశపెట్టారు. హైదరాబాద్‌ను బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా బిల్లు తెచ్చినట్లు ఆయన స్పష్టం చేశారు. రాబోయే 30 ఏళ్ల అవసరాల దృష్ట్యా క్యూర్ చట్టంలో మార్పులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరాలతో పోటీపడే విధంగా చేయాలనే ఉద్దేశంతో మూసీ పునరుజ్జీవం చేపట్టామని తెలిపారు. బెంగుళూరు, ముంబై, ఢిల్లీ మాదిరిగా హైదరాబాద్ మహా నగరపాలిక సంస్థ చట్టంలో సెక్షన్లు తగ్గించే ప్రణాళిక చేస్తున్నామని వివరించారు. హైదరాబాద్ విస్తరణ పెద్ద ఎత్తున జరుగుతోందని, రాబోయే 30 ఏళ్ల అవసరాల దృష్ట్యా మరింత సమర్థంగా పాలన కోసం క్యూర్ చట్టం తీసుకువచ్చినట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్ గత వైభవాన్ని కాపాడుకుంటూ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సిద్ధం చేయాలని అన్నారు. తెలంగాణ రైజింగ్-2047 పాలసీ రూపొందించుకుని ముందుకెళ్తున్నామని వివరించారు. 2034 నాటికి ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ - మిగతా 2 లో

## నిషేధిత భూముల జాబితా కొత్తగా వచ్చింది కాదు, గతంలో ఉన్నదే



- మంత్రి పొంగులేటి
- ధరణి పోర్టల్ అడ్డుపెట్టుకుని గత పాలకులు వేలాది ఎకరాలు చెరబట్టారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు
- 22ఏపై అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు.
- అసెంబ్లీలో మంత్రి తీవ్ర ఆగ్రహం

**హైదరాబాద్ :**

నిషేధిత భూముల జాబితా కొత్తగా వచ్చింది కాదని, గతంలో ఉన్నదేనని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి - మిగతా 2 లో

# చేతులు కలిపిన మోదీ, పుతిన్, జిన్‌పింగ్



- ఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ సదస్సులో ప్రత్యేక దృశ్యం
- రష్యా, చైనా అధ్యక్షులతో చేతులు కలిపిన ప్రధాని మోదీ
- ఏడేళ్ల తర్వాత భారత్‌లో పర్యటిస్తున్న జిన్‌పింగ్
- 'న్యూఢిల్లీ డిక్లరేషన్' ఆమోదించిన బ్రిక్స్ దేశాలు
- గ్లోబల్ సౌత్ పాత్ర పెరగాలని పిలుపునిచ్చిన మోదీ

**ఢిల్లీ :**

భారత ఆతిథ్యమిస్తున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ఒక ఆసక్తికర సన్నివేశం అందరి దృష్టిని ఆకర్షించింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లతో కలిసి ఉన్న ఒక ఫోటోను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్నారు. "ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు 2026 ప్రారంభమైంది" అనే క్యాప్షన్‌తో ఆయన ఈ పోస్ట్ చేశారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముగ్గురు అగ్రనేతలు ఎంతో స్నేహపూర్వకంగా కనిపించడం ప్రాధాన్యత సంతరించుకుంది. దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత షీ జిన్‌పింగ్ భారత్‌లో పర్యటిస్తుండటం గమనార్హం. ఆయన శనివారం మధ్యాహ్నం ఢిల్లీకి చేరుకోగా, పుతిన్ అంతకుముందే శుక్రవారం భారత్‌కు చేరుకున్నారు. ప్రధాని మోదీ పంచుకున్న ఇతర చిత్రాలలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో కూడా ఉన్నారు. భారత్ అధ్యక్షతన నిర్వహిస్తున్న 18వ బ్రిక్స్ - మిగతా 2 లో

# 25,000 క్యాబ్ డ్రైవర్ల సమ్మె

- శంషాబాద్‌లో ప్రయాణికులకు ఇబ్బందులు
- శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో నిలిచిపోయిన క్యాబ్ సేవలు
- సమ్మె బాట పట్టిన సుమారు 25,000 మంది డ్రైవర్లు
- ప్రభుత్వ జీవో 46 అమలు చేయాలని ప్రధాన డిమాండ్
- ఓలా, ఉబెర్, రాపిడో ఎయిర్‌పోర్ట్ రైడ్స్‌ను బహిష్కరించిన యూనియన్
- కిలోమీటర్‌కు రూ. 21 బదులు రూ. 12 మాత్రమే ఇస్తున్నారని ఆరోపణ



**హైదరాబాద్ :**

హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ)లో క్యాబ్ సేవలు పూర్తిగా స్తంభించిపోయాయి. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ (టీజీపీడబ్ల్యుయూ) ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం నుంచి దాదాపు 25,000 మంది క్యాబ్ డ్రైవర్లు సమ్మె చేపట్టారు. ఓలా, ఉబెర్, రాపిడో వంటి ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఎయిర్‌పోర్ట్ ట్రిప్పులను డ్రైవర్లు పూర్తిగా బహిష్కరించారు. ప్రభుత్వం 2022 డిసెంబర్ 9న జారీ చేసిన జీవో 46ను తక్షణమే అమలు చేయాలన్నది డ్రైవర్ల ప్రధాన డిమాండ్. ఈ జీవో ప్రకారం, ఎయిర్‌పోర్ట్ ప్రీపెయిడ్ సర్వీసులకు కిలోమీటరుకు రూ. 21 చొప్పున ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ప్రస్తుతం తమకు కిలోమీటరుకు కేవలం రూ. 12 నుంచి రూ. 15 మాత్రమే అందుతున్నాయని యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ ఆరోపించారు. ఈ అంశంపై ఆగస్టు 31న కార్మిక శాఖ జాయింట్ - మిగతా 2 లో




### ఆ ఏడు దశల
## వెరిఫికేషన్ ఏమైంది

- డీఎస్సీపై ప్రభుత్వాన్ని నిలదీసిన జగన్
- మెగా డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌పై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన జగన్
- ఏడు దశల తనిఖీ అంటున్నా అక్రమాలు ఎలా జరిగాయని విమర్శ
- నకిలీ ఖోఖో సర్టిఫికెట్లు, జరగని క్రీడాపోటీల అంశాలను ప్రస్తావించిన వైనం
- నియామక ప్రక్రియపై ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్

# వేలంలో కోట్లు పలికిన 130 ఏళ్ల నాటి అరుదైన నాణెం




- 1894-ఎస్ బార్బర్ డైమ్ వేలంలో రూ.10 కోట్లకు పైగా ధర
- 24 నాణేలను మాత్రమే ముద్రించిన శాన్ ఫ్రాన్సిస్కో మింట్
- ప్రస్తుతం మనుగడలో 9 నాణేలు
- 36 ఏళ్ల తర్వాత మార్కెట్లోకి రావడంతో ఈ నాణేనికి భారీ ధర

**ఢిల్లీ :**

ఒకప్పుడు కేవలం 10 సెంట్ల (సుమారు రూ. 8) విలువ కలిగిన ఒక చిన్న నాణెం, నేడు కోట్లాది రూపాయల విలువైన మహా సంపదగా మారింది. అమెరికాకు చెందిన అత్యంత అరుదైన '1894-ఎస్ బార్బర్ డైమ్' నాణెం ఇటీవల జరిగిన వేలంలో ఏకంగా - మిగతా 2 లో

# ఏపీ వైద్యరంగానికి డబుల్ ఇంజిన్ బలం

- రూ.249 కోట్ల ప్రాజెక్టులను ప్రారంభించిన నడ్డా, చంద్రబాబు
- విజయవాడలో నడ్డా, చంద్రబాబు పర్యటన
- రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి 500 క్రిటికల్ కేర్ బెడ్లు
- త్వరలో 'సంజీవని' ప్రాజెక్టు ప్రారంభిస్తామన్న సీఎం చంద్రబాబు
- అమరావతి బయో క్వాంటం వ్యాలీకి జాతీయ హోదా కోరిన సీఎం
- డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లే అభివృద్ధి సాధ్యమైందన్న చంద్రబాబు



**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్‌లో వైద్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలక ముందడుగు వేశాయి. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం విజయవాడలో పర్యటించి, రాష్ట్రవ్యాప్తంగా రూ. 249 కోట్ల వ్యయంతో నిర్మించిన 22 ఆరోగ్య ప్రాజెక్టులను సంయుక్తంగా ప్రారంభించారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే ఇలాంటి అభివృద్ధి సాధ్యమని ఈ సందర్భంగా నేతలు స్పష్టం చేశారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అత్యవసర, అత్యాధునిక వైద్యం అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టులను అందుబాటులోకి తెచ్చారు. విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన క్రిటికల్ కేర్ బ్లాక్, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ (ఐపీహెచ్) ల్యాబొరేటరీలను నడ్డా, చంద్రబాబు నేరుగా ప్రారంభించి, అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఐపీహెచ్ ల్యాబ్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 500 క్రిటికల్ కేర్ బెడ్లతో పాటు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ డబుల్ ఇంజిన్ - మిగతా 2 లో

# ఢిల్లీ డిక్లరేషన్‌ను ఆమోదించిన బ్రిక్స్ సదస్సు

- బ్రిక్స్ ఢిల్లీ డిక్లరేషన్‌ను ప్రకటించిన ప్రధాని మోదీ
- విభేదాలు పక్కనపెట్టి ఢిల్లీ డిక్లరేషన్‌కు ఆమోదం తెలిపిన అరబ్ దేశాలు
- ఐరాస భద్రతామండలి, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ సంస్కరణలకు మద్దతు
- ఏకపక్ష ఆంక్షలు, సుంకాలు, రక్షణాత్మక వాణిజ్య విధానాలకు వ్యతిరేకత
- గాజాలో కాల్పుల విరమణ, మానవతా సాయం కొనసాగాలని డిమాండ్
- జమ్మూకశ్మీర్ ఉగ్రదాడిని ఖండిస్తూ ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానం



**ఢిల్లీ :**

న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న 18వ బ్రిక్స్ సదస్సులో సభ్య దేశాలు కీలక నిర్ణయాలు తీసుకున్నాయి. ప్రపంచ వ్యవస్థలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాధాన్యం కల్పించాలని న్యూఢిల్లీ డిక్లరేషన్‌లో పిలుపునిచ్చాయి. ముఖ్యంగా ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాలకు అంతర్జాతీయ సంస్థల్లో ఎక్కువ ప్రాతినిధ్యం ఉండాలని స్పష్టం చేశాయి. ప్రపంచ వ్యవస్థ మరింత ప్రజాస్వామ్యబద్ధంగా, బహుళ ధ్రువంగా మారాలని బ్రిక్స్ నేతలు ఆకాంక్షించారు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలి సంస్కరణలకు బ్రిక్స్ మరోసారి మద్దతు తెలిపింది. భారత్, బ్రెజిల్‌కు ఐరాసలో, ముఖ్యంగా భద్రతామండలిలో, మరింత కీలక పాత్ర కల్పించాలన్న ఆకాంక్షలకు చైనా, రష్యా మద్దతు తెలిపిన విషయాన్ని ప్రకటనలో స్వాగతించారు. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ - మిగతా 2 లో

# సంపాదకీయం

## సమష్టి స్వరం సాధ్యమేనా!

రష్యా--ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో ఇరాన్‌తో అమెరికా లడాయి, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఏకపక్షంగా విధిస్తున్న సుంకాలు వగైరాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్ని ఊపిరాడకుండా చేస్తున్న తరుణంలో న్యూఢిల్లీలో శని, ఆదివారాల్లో బ్రిక్స్ దేశాల 18వ శిఖరాగ్ర సదస్సు జరగబోతోంది. ఈ సదస్సులో పాల్గొనేందుకు ఇప్పటికే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ రాగా... చైనా అధ్య క్షుడు షీ జిన్‌పింగ్ శనివారం చేరుకుంటారు. ఆయన ఏడేళ్ల తర్వాత మన దేశం వస్తున్నారు. ఇక ఇరాన్ అధ్యక్షుడొకరు భారత్‌కొచ్చి ఎనిమిదేళ్లవుతుండగా, పెజెష్కియాన్ అడుగుపెట్టారు. ప్రధాని నరేంద్ర మోదీతో పుతిన్ ద్వైపాక్షిక సమావేశం జరగటం,ఆ వెంటనే పెజెష్కియాన్ కూడా ఆయనతో ద్వైపాక్షిక భేటీ కావటంతో పాటు, తదనంతరం జరిగిన బ్రిక్స్ బిజినెస్ ఫోరం సమావేశంలో కూడా పాలుపంచుకోవటంతో దౌత్య సందడి ముందే మొదలైనట్టయింది. ఆవిర్భవించిననాడు బ్రిక్స్‌వి బుడి బుడి అడుగులే. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాల విదేశాంగమంత్రులు 2006లో తొలిసారి సమావేశమై కూటమిగా ఏర్పడాలని నిర్ణయించారు. 2009లో తొలి శిఖరాగ్ర సమావేశం జరిగింది. దక్షిణాఫ్రికా 2011లో చేరాక చివరిలో 'ఎస్' చేరి బ్రిక్స్ అయింది. అటుపై వరసగా ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ, ఇండొనేసియాలు వేర్వేరు సంవత్సరాల్లో చేతులు కలిపాయి. మొత్తంగా ఇది 20 దేశాల కూటమిగా రూపొందింది. ప్రపంచ జనాభాలో బ్రిక్స్ దేశాల వాటా 49.5 శాతం. ప్రపంచంలోని నాలుగోవంతు భూభాగం దీని సొంతం. ప్రపంచ జీడీపీలో దాదాపు 30 శాతం వాటా. వాణిజ్య ఎగుమతుల్లో 21.6 శాతం, దిగుమతుల్లో 17.3 శాతం వాటా ఈ దేశాలదే. ప్రపంచ ఇంధన ఉత్పత్తిలో బ్రిక్స్ వాటా 40 శాతం. కొనుగోలు శక్తిలో జీ7 దేశాలకన్నా బ్రిక్స్ దేశాలదే అధికం. ప్రపంచ బ్యాంకుకు ప్రత్యా మ్నాయంగా పేద దేశాలకు తోడ్పడే సుస్థిర పట్టణాభివృద్ధి ప్రణాళిక, మౌలిక సదుపాయా లపై సూచనలివ్వటం, వాటి వ్యయానికి నిధులు సమకూర్చటం తదితరాలను చైనాలోని షాంఘైలో ప్రధాన కార్యాలయం ఉన్న బ్రిక్స్‌కు చెందిన న్యూ డెవెలప్‌మెంట్ బ్యాంకు (ఎన్‌డీబీ) చూస్తోంది. సభ్యదేశాల జాతీయ కరెన్సీల్లో వాణిజ్యం నెరపుతూ డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకోవటం, చెల్లింపులకోసం స్విఫ్ట్ వంటి పేమెంట్ విధానంలోకాక 'బ్రిక్స్ పే' ద్వారా లావాదేవీలు జరపటం ఇప్పటికే మొదలయ్యాయి. ఇన్నివిధాల సహాయ సహకారాలు కొనసాగే బ్రిక్స్ ఎప్పటికీ ఇలాగే కొనసాగుతుందా అనే సంశయం చాలా మందికి ఉంది. ఎందుకంటే ఈ కూటమిలోని దేశాలే వేరే కూటముల్లో ఉన్నాయి. సౌదీ అరేబియా, యూఏఈ అమెరికా కనుసన్నల్లో నడుస్తాయి. పశ్చిమాసియా యుద్ధంలో అమెరికాకు సహకరిస్తూ ఇరాన్‌కు వ్యతిరేకంగా ఉన్నాయి. భారత్, చైనాల మధ్య సరిహద్దు వివాదాలు సరేసరి. అయితే ఆగిపోవటం కన్నా అడుగు ముందుకేయటమే అందరికీ ప్రయోజనకరం. కలిసి పనిచేసే సంస్కృతి పెంపొందటంవల్ల అపోహలు తొలగే అవకాశం ఉంటుంది. దగ్గరయ్యేందుకు వీలుంటుంది. సమష్టి కార్యా చరణ అవసరమైన రంగాలు చాలానే ఉన్నాయి. ఉగ్రవాదం, సైబర్ సెక్యూరిటీ, ఐక్యరాజ్యసమితిని బహుళ ప్రాతినిధ్య సంస్థగా చేయాలన్న డిమాండ్ వగైరాల్లో ఈ దేశాలు సమష్టిగా పనిచేయొచ్చు. వాతావరణం, విద్య, ఇంధనం, డిజిటల్ పేమెంట్ వేదికలు వగైరాల్లో సహకరించుకోవచ్చు. అలాగని కల్లోల కాలంలో కూటములు మనుగడ అంత సులభమేమీ కాదు. తమపై అమెరికా ప్రకటించిన దురాక్రమణ యుద్ధాన్ని బ్రిక్స్ ఖండించాలని ఇరాన్ బలంగా కోరుకుంటోంది.అదే సమయంలో తమపై ఇరాన్ సాగిస్తున్న దాడుల్ని కూడా వ్యతిరేకించాలని సౌదీ, యూఏఈ ఆశిస్తాయి. అందుకే బ్రిక్స్ ఉమ్మడి ప్రకటన అంత సులభమేమీ కాదు. ఇటీవల బిష్కెక్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సు నేరుగా అమెరికానూ, ఇజ్రాయెల్‌నూ ప్రస్తావించకుండా ఇరాన్‌పై దాడిని ఖండించింది. అక్కడైతే సౌదీ, యూఏఈ సభ్యదేశాలు కాదు. ఇక్కడ పరిస్థితి వేరు. ఈ సమస్యను బ్రిక్స్ ఎలా పరిష్కరించుకుంటుందో చూడాల్సివుంది. ఆ దేశాలకూ, ఇరాన్‌కూ మధ్య ఏదోమేర సామరస్యం సాధించగలిగితే, సమష్టి స్వరం వినిపించగలిగితే బ్రిక్స్ బలం మరింత పెరుగుతుంది.

## ఏపీ వైద్యరంగానికి డబుల్ ఇంజిన్ బలం



**మొదటిపేజీ తరువాయి -** సర్కార్ వల్లే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని అన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి నడ్డా సహకారంతో రాష్ట్ర వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్నామని తెలిపారు. "త్వరలోనే రాష్ట్రంలో 'సంజీవని' ప్రాజెక్టును ప్రారంభించబోతున్నాం. ఇది వైద్య రంగంలో ఒక గేమ్ ఛేంజర్ కానుంది. జనవరి 1 నుంచి ప్రజల ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేస్తాం" అని చంద్రబాబు కీలక ప్రకటన చేశారు.అమరావతికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వస్తోందని, లడ్డాఖ్‌లో కూడా అమరావతి గురించి చర్చించుకుంటున్నారని చంద్రబాబు పేర్కొన్నారు. "అమరావతిలో ఏర్పాటు చేయనున్న 'బయో క్వాంటం వ్యాలీ'కి జాతీయ గుర్తింపు ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతున్నాను. దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్ అమరావతిలో ప్రారంభం కానుంది" అని కేంద్ర మంత్రి నడ్డాను అభ్యర్థించారు. ఆహారమే ఔషధంగా 'కిచెన్ ఫార్మసీ'ని ప్రోత్సహించాలని, ప్రతి ఒక్కరూ యోగా, ధ్యానం అలవర్చుకోవాలని సూచించారు. కేంద్రం సహకారం, రాష్ట్ర సంకల్పం, ప్రజల భాగస్వామ్యంతో ఏపీని 'హెల్తీ-వెల్తీ-హ్యాపీ ఆంధ్రప్రదేశ్'గా తీర్చిదిద్దుతామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

## చేతులు కలిపిన మోదీ, పుతిన్, జిన్‌పింగ్



**మొదటిపేజీ తరువాయి -** శిఖరాగ్ర సదస్సు శనివారం ఘనంగా ప్రారంభమైంది. ప్రపంచ గమనాన్ని నిర్దేశించడంలో గ్లోబల్ సౌత్ దేశాలు ఇకపై వెనుకవరుసకే పరిమితం కాకుండా, నిర్ణయాధికారాల్లో కీలక భాగస్వాములు కావాలని ప్రధాని మోదీ తన ప్రారంభోపన్యాసంలో పిలుపునిచ్చారు. వివిధ అంశాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పటికీ, శనివారం తెల్లవారుజాము వరకు జరిగిన సుదీర్ఘ చర్చల అనంతరం 'న్యూఢిల్లీ డిక్లరేషన్'కు బ్రిక్స్ దేశాధినేతలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

# ఢిల్లీ డిక్లరేషన్‌ను ఆమోదించిన బ్రిక్స్ సదస్సు



**మొదటిపేజీ తరువాయి -** సహా బ్రెట్టన్ వుడ్స్ సంస్థల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల ఓటింగ్ హక్కు, నిర్ణయాధికారం పెరగాలని కోరారు. ఐరాసలో ఉన్నత పదవుల్లో మహిళల ప్రాతినిధ్యం కూడా పెరగాలని పేర్కొన్నారు.ఏకపక్ష ఆర్థిక ఆంక్షలు, ఇతర దేశాలపై విధించే ద్వితీయ ఆంక్షలను బ్రిక్స్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇవి అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని, ఆహార భద్రత, ఆరోగ్యం, అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతాయని పేర్కొంది. ఏకపక్ష సుంకాలు, పన్నేతర ఆంక్షలు, రక్షణాత్మక వాణిజ్య విధానాలు ప్రపంచ వాణిజ్యాన్ని దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రపంచ వాణిజ్య సంస్థలో వివాద పరిష్కార వ్యవస్థను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని కోరింది. డబ్ల్యూటీవో అప్పీలేట్ బాడీలో కొత్త సభ్యుల నియామకానికి మద్దతు తెలిపింది.అంతర్జాతీయ వివాదాలకు యుద్ధం కాకుండా చర్చలు, దౌత్యం, మధ్యవర్తిత్వమే పరిష్కార మార్గాలని బ్రిక్స్ పేర్కొంది. గాజాలో కాల్పుల విరమణ కొనసాగాలని, మానవతా సాయం ఎలాంటి అడ్డంకులు లేకుండా అందాలని కోరింది. పాలస్తీనియన్లను బలవంతంగా తరలించడాన్ని ఆపాలని, పౌరులు, పౌర మౌలిక వసతులకు రక్షణ కల్పించాలని స్పష్టం చేసింది. 1967 సరిహద్దుల ఆధారంగా రెండు దేశాల పరిష్కారానికి మద్దతు తెలిపింది. తూర్పు జెరూసలేం పాలస్తీనా రాజధానిగా ఉండాలని పేర్కొంది. ఐరాసలో పాలస్తీనాకు పూర్తిస్థాయి సభ్యత్వానికి మద్దతు ఇచ్చింది. లెబనాన్‌లో కాల్పుల విరమణను స్వాగతిస్తూ ఐరాస తీర్మానం 1701 అమలు చేయాలని కోరింది.సూడాన్‌లో తక్షణమే శాశ్వత కాల్పుల విరమణ జరగాలని బ్రిక్స్ కోరింది. ప్రజలకు మానవతా సాయం అందించేందుకు అడ్డంకులు తొలగించాలని పేర్కొంది. సమస్యకు ఆఫ్రికా దేశాలే పరిష్కారం చూపాలన్న విధానాన్ని సమర్థించింది. సిరియాలో ఆ దేశ ప్రజల ఆధ్వర్యంలో, ఐరాస సహకారంతో రాజకీయ ప్రక్రియ కొనసాగాలని తెలిపింది. ఆక్రమణ దళాలు అక్కడి నుంచి వెళ్లిపోవాలని పిలుపునిచ్చింది.ఉగ్రవాదానికి ఎలాంటి మినహాయి ంపులు ఉండకూడదని బ్రిక్స్ స్పష్టం చేసింది. అన్ని రూపాల్లో ఉగ్రవాదాన్ని ఖండించింది. 2025 ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్‌గావ్‌లో జరిగిన ఉగ్రదాడిని ప్రత్యేకంగా ప్రస్తావించింది. ఆ దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని ఖండించింది. ఐరాసలో సమగ్ర అంతర్జాతీయ ఉగ్రవాద వ్యతిరేక ఒప్పందాన్ని త్వరగా ఆమోదించాలని కోరింది.ఉగ్రవాదానికి నిధులు, మానవ అక్రమ రవాణా, ఆయుధాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు దేశాల మధ్య సహకారం పెరగాలని సూచించింది. డ్రగ్స్ ద్వారా జరిగే మనీలాండరింగ్, సైబర్ నేరాలు, అక్రమ వర్చువల్ ఆస్తుల లావాదేవీలపైనా దృష్టి పెట్టాలని పేర్కొంది. అంతర్జాతీయంగా పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాల నెట్‌వర్క్‌లను ఎదుర్కొనేందుకు సమన్వయం పెంచాలని తెలిపింది. ఆస్తుల రికవరీ, పరారీలో ఉన్న నిందితుల గుర్తింపు, సరిహద్దులు దాటి జరిగే అవినీతిని అడ్డుకునే కొత్త సహకార విధానాలను కూడా బ్రిక్స్ స్వాగతించింది.

## ఆ ఏడు దశల వెరిఫికేషన్ ఏమైంది?

**మొదటిపేజీ తరువాయి -** ఏపీ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక మెగా డీఎస్సీపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎక్స్ వేదికగా తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్ల పరిశీలనలో ప్రభుత్వం చెబుతున్న 'ఏడు దశల వెరిఫికేషన్' ప్రక్రియపై ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఇన్ని దశల తనిఖీలు జరుగుతున్నాయని చెబుతున్నప్పటికీ, అక్రమాలు వెలుగుచూడటాన్ని ఆయన ప్రశ్నించారు. ఉపాధ్యాయ అభ్యర్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం తేలికగా వ్యవహరిస్తోందని సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు.ఈ సందర్భంగా జగన్ కొన్ని నిర్దిష్ట ఘటనలను ఉటంకించారు. కొందరు విజేతల పేర్లు జాబితాలో గల్లంతవడం, కొన్ని సర్టిఫికెట్లు నకిలీవని స్వయంగా ఖోఖో క్రీడా సమాఖ్య అధికారులు చెప్పడం, ఒక అభ్యర్థి పేర్కొన్న క్రీడా ఈవెంట్‌ను తాము అసలు నిర్వహించలేదని నాగార్జున విశ్వవిద్యాలయం స్పష్టం చేయడం వంటి ఉదంతాలను ఆయన ప్రస్తావించారు."ఇన్ని అక్రమాలు బయటపడుతుంటే, అసలు ఎక్కడ, ఏం వెరిఫికేషన్ చేశారు?" అని జగన్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇన్ని లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నా, డీఎస్సీ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నామని ప్రభుత్వం ఎలా చెప్పగలదని ఆయన ప్రశ్నించారు.ఈ లోపాలే అక్రమాలకు ఆస్కారం కల్పించాయా అని సందేహం వ్యక్తం చేశారు. జరిగిన తప్పులకు ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నియామక ప్రక్రియలో నెలకొన్న పరిస్థితులపై సమగ్రమైన వివరణ ఇవ్వాలని ఆయన కోరారు.కాగా, మెగా డీఎస్సీ నియామక ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ప్రతిపక్ష వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూనే ఉంది. అయితే, నిబంధనల ప్రకారమే నియామకాలు జరిగాయని, సర్టిఫికెట్ల పరిశీలన పలు దశల్లో పకడ్బందీగా నిర్వహించామని ప్రభుత్వం పలుమార్లు స్పష్టం చేసింది.కొన్ని ఆరోపణలపై అధికారులు మీడియా సమావేశాల్లో వివరణ కూడా ఇచ్చారు. అయినప్పటికీ, తాజాగా జగన్ చేసిన వ్యాఖ్యలతో ఈ అంశం రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం చెబుతున్న పారదర్శకతకు, ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలకు మధ్య డీఎస్సీ ప్రక్రియ రాజకీయ వివాదంగా కొనసాగుతోంది.

## వేలంలో కోట్లు పలికిన 130 ఏళ్ల నాటి అరుదైన నాణెం

**మొదటిపేజీ తరువాయి -** 1,250,500 డాలర్లకు (సుమారు రూ. 10.4 కోట్లు) అమ్ముడుపోయింది. సెప్టెంబర్ 1న 'స్టాక్స్ బోవర్స్ గ్యాలరీస్' నిర్వహించిన ఈ వేలంలో పురాతన నాణేల సేకరణకారులు దీనిని దక్కించుకోవడం కోసం తీవ్రంగా పోటీపడ్డారు.ఈ నాణేనికి ఇంత భారీ ధర పలకడానికి ప్రధాన కారణం అది అత్యంత అరుదైనది కావడమే. 1894 జూన్‌లో శాన్ ఫ్రాన్సిస్కో మింట్ ఈ డిజైన్‌తో కేవలం 24 నాణేలను మాత్రమే ముద్రించింది. వాటిలో ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కేవలం 9 నాణేలు మాత్రమే మనుగడలో ఉన్నాయని నిపుణులు ధ్రువీకరించారు. దీంతో అమెరికాలోని అత్యంత అరుదైన నాణేల జాబితాలో ఇది ఒకటిగా నిలిచింది. ఈ నాణేనికి ఒకవైపు 'లిబర్టీ' చిత్రం, మరోవైపు "వన్ డైమ్" అని రాసి ఉన్న పూలదండ మధ్యలో "ఎస్" అనే మింట్ గుర్తు ఉంటుంది.1893లో సంభవించిన తీవ్ర ఆర్థిక సంక్షోభం కారణంగా కొత్త నాణేలకు డిమాండ్ తక్కువగా ఉన్న సమయంలో వీటిని ముద్రించారు. అయితే, కేవలం 24 నాణేలనే ఎందుకు ముద్రించారనే అంశంపై భిన్న కథనాలు ఉన్నాయి. మిగిలిపోయిన కొద్దిపాటి లోహంతో వీటిని తయారు చేశారని కొందరు చెబుతుంటే, అప్పటి మింట్ సూపరింటెండెంట్ జాన్ డాగెట్ తన బ్యాంకర్ స్నేహితులకు బహుమతిగా ఇచ్చేందుకు వీటిని ప్రత్యేకంగా ముద్రించారని మరో కథనం ప్రచారంలో ఉంది. ఈ రహస్యమే ఆ నాణెం విలువను మరింత పెంచింది.ఈ నిర్దిష్ట నాణేనికి కూడా ఒక ప్రత్యేక చరిత్ర ఉంది. ప్రముఖ నాణేల సేకరణ నిపుణుడు డేవిడ్ బోవర్స్ 1957లో తన 19వ ఏట దీనిని కేవలం 4,750 డాలర్లకు కొనుగోలు చేశారు. సుమారు 36 ఏళ్లుగా మార్కెట్లో ఎక్కడా కనిపించని ఈ నాణెం ఇప్పుడు వేలానికి రావడంతో భారీ ధర పలికింది. నాణేల కొరత, చారిత్రక ప్రాధాన్యం, దాని వెనుక ఉన్న నిగూఢ రహస్యం కలిసి ఒకప్పటి 10 సెంట్ల నాణేన్ని 130 ఏళ్ల తర్వాత కోట్లాది రూపాయల అరుదైన నిధిగా మార్చాయి.

## వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

**మొదటిపేజీ తరువాయి -** పండుగ వేళ భక్తులకు, మండప నిర్వాహకులకు ఎదురయ్యే క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగారు. ఉత్సవ కమిటీలు, ప్రజాప్రతినిధులు, పోలీసు, మున్సిపల్ ఉన్నతాధికారులతో సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయిన ఆయన... పండుగ నిర్వహణపై సమగ్ర సమీక్ష జరిపారు.దేశంలో ఎక్కడా లేని విధంగా మన తెలంగాణలోనే గణేశ్ మండపాలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నిర్వాహకులు అధికారులకు ముందస్తుగా దరఖాస్తు చేసుకుని ఈ ఉచిత విద్యుత్ సదుపాయాన్ని పొందొచ్చని సూచించారు. "స్థానిక పోలీస్ స్టేషన్లలో మండపాల సమాచారం ఇవ్వండి. దానివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవడమే కాకుండా, మన భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేయడానికి వీలవుతుంది" అని ఆయన స్పష్టం చేశారు.చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తూ... "మనం అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మ ఉత్సవాలకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నామో, గణేశ్ నిమజ్జనాలకు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్ద క్రేన్లు పెట్టేందుకు వీలుగా చెరువు గట్లు, పరిసరాలను సిద్ధం చేయాలి" అని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి 24 గంటలూ పర్యవేక్షణ ఉండాలని, మున్సిపల్, పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని చెప్పారు."హైదరాబాద్ ప్రశాంతంగా, సురక్షితంగా ఉంటేనే మన రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తాయి, మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. అందుకే శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. మండపాల నిర్వాహకులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

## 25,000 క్యాబ్ డ్రైవర్ల సమ్మె



**మొదటిపేజీ తరువాయి -** కమిషనర్ ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధులు, కంపెనీల యాజమాన్యాలతో కీలక సమావేశం జరిగింది. జీవో నిబంధనల ప్రకారం ఛార్జీలు చెల్లించాలని అధికారులు ఆదేశించినప్పటికీ, సదరు కంపెనీలు వాటిని బేఖాతరు చేశాయని యూనియన్ ఆవేదన వ్యక్తం చేసింది."మేము ఎలాంటి ప్రత్యేక సౌకర్యాలు కోరడం లేదు. మాకు దక్కాల్సిన చట్టబద్ధమైన ఛార్జీలతో పాటు వృత్తిపరమైన గౌరవం, సమానత్వం కావాలి" అని అన్నారు. ఈ సమస్యలపై సమగ్రంగా చర్చించి, లిఖితపూర్వక హామీ ఇచ్చేందుకు ప్రభుత్వం వెంటనే సంబంధిత భాగస్వామ్య పక్షాలతో సమావేశం ఏర్పాటు చేయాలని యూనియన్ విజ్ఞప్తి చేసింది.

# హైదరాబాద్‌ను బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం



**మొదటిపేజీ తరువాయి -** రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళుతున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. లక్ష్య సాధనకు హైదరాబాద్ మరింత అధునాతనంగా అంతర్జాతీయ స్థాయికి చేరాలని అన్నారు. ప్రపంచ నగరాలతో పోటీపడే స్థాయికి హైదరాబాద్ ఎదగాలన్నారు. పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షించే స్థాయికి మనం ఎదగాలని పేర్కొన్నారు. క్యూర్, ప్యూర్, రేర్ నినాదంతో రాష్ట్ర అభివృద్ధికి చర్యలున్నాయని గుర్తు చేశారు.'క్యూర్' తెలంగాణ ఆర్థిక ప్రగతికి అత్యంత కీలక ప్రాంతమని, రాష్ట్ర విస్తీర్ణంలో చిన్నదైనా తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో క్యూర్ పాత్ర పెద్దదని శ్రీధర్ బాబు వివరించారు. 2025-26లో తెలంగాణ జీఎస్‌డీపీ రూ.17.82 లక్షల కోట్లకు చేరిందని, క్యూర్ పరిధిలో 10.7 శాతం వృద్ధి నమోదైనట్లు తెలిపారు. ఆర్థిక వ్యవస్థ సేవా రంగానికి సంబంధించి 68.6 శాతం వృద్ధి నమోదైందని అన్నారు. సేవా రంగం, పెట్టుబడులు, ఉపాధికి ప్రధాన కేంద్రంగా హైదరాబాద్ ఉందని అన్నారు. క్యూర్ పరిధి హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు ఆర్థిక ఉత్పత్తిలో తొలి 3 స్థానాల్లో ఉన్నాయన్నారు. క్యూర్ ప్రాంతంలో పరిపాలన వ్యవస్థను భవిష్యత్ అవసరాల మేరకు పునర్నిర్మించాలన్నారు."కాలం చెల్లిన నిబంధనలు తొలగించాలని, భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడే చట్టాన్ని తీసుకువచ్చే ఆలోచన చేశాం. ఈ క్యూర్ బిల్లులో ఐదు భాగాలు ఉన్నాయి. ఇందులో ఐదు భాగాలు, 43 చాప్టర్లు, 319 సెక్షన్లు, 9 షెడ్యూళ్లు ఉన్నాయి. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్లకు ఒకే రకమైన చట్టం ఉంటుంది. దీనిలో ప్రజలకు సేవలు అందించే విధానాన్ని మాత్రమే మారుస్తున్నాం.హైదరాబాద్‌లో రవాణా కోసం కాంప్రిహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ చేశామని శ్రీధర్ బాబు తెలిపారు. రాబోయే 30 ఏళ్ల అవసరాల దృష్ట్యా క్యూర్ చట్టం పని చేస్తుందని అన్నారు. మూసీ పునరుజ్జీవం తొలి దశకు రూ.7,345.12 కోట్లతో అనుమతులు తీసుకున్నట్లు వివరించారు. 20 టీఎంసీల గోదావరి జలాలు తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జీహెచ్‌ఎంసీని ట్రై కార్పొరేషన్లుగా విభజించుకున్నామని, అన్ని సంస్థలు సమన్వయంతో పని చేసేలా చట్టబద్ధ వ్యవస్థగా ఏర్పాటు చేస్తున్నామన్నారు.సీఎం అధ్యక్షతన క్యూర్ అత్యున్నత పాలక మండలి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహానగరపాలిక చట్టంలో సెక్షన్లు తగ్గించే ప్రణాళిక చేస్తున్నామన్నారు. మురుగునీటిని శుద్ధి చేసి పునర్వినియోగం చేసే దిశగా యోచన చేస్తున్నట్లు చెప్పారు. చెట్ల పెంపకం, కాలుష్య నివారణకు వాడాలనే ప్రభుత్వ ఆలోచనలు ఉన్నాయని, హైదరాబాద్‌ను బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# నిషేధిత భూముల జాబితా కొత్తగా వచ్చింది కాదు, గతంలో ఉన్నదే

**మొదటిపేజీ తరువాయి -** పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ భూములను బలమున్నవాడు కొల్లగొట్టకుండా తెచ్చిన చట్టమని వివరించారు. 22ఏ నిషేధిత జాబితా భూముల అంశంపై అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చ సందర్భంగా మంత్రి పొంగులేటి సుదీర్ఘంగా మాట్లాడారు. 1995లో ఘట్కేసర్ రైల్వేస్టేషన్ భూమిని కూడా ఒకరికి రిజిస్ట్రేషన్ చేశారన్న మంత్రి పొంగులేటి, అలాంటి అక్రమాలు మళ్లీ జరగొద్దనే నిషేధిత భూముల జాబితా తెచ్చారన్నారు. మళ్లీ కేసీఆర్ హయంలో 2016లో కొత్తగా జీవో 121 జారీ చేశారని చెప్పారు. జీవో 121 తీసుకువచ్చి చాలామంది రైతులను నిషేధిత జాబితాలో చేర్చారని ఆరోపించారు. తమ ప్రభుత్వం కొత్తగా నిషేధిత జాబితాలో ఒక్క ఎకరమూ చేర్చలేదని శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ఆస్తుల పరిరక్షణే రెవెన్యూ సంస్కరణల లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.నిషేధిత జాబితాలో ఉండకూడని భూములు కొన్ని ఆనాటి నుంచి ఉన్నాయని పొంగులేటి వివరించారు. బీఆర్ఎస్ హయాంలోనూ అదే కాపీని అప్‌లోడ్ చేశారన్నారు. దానిని అధికారులు ప్రింట్ తీసి మరోసారి అప్‌లోడ్ చేశారని వివరించారు. ఇక్కడే పొరపాటు జరిగిందని చెప్పారు. ఇది మొదటి నుంచీ జరిగిన పొరపాటని మంత్రి అసెంబ్లీలో వెల్లడించారు. ఉమ్మడి ఏపీ హయాం నుంచి వచ్చిన జీవోల ఆధారంగానే ఆ కాపీ రూపొందిందని పొంగులేటి గుర్తు చేశారు.గతంలో కొన్ని భూములను ప్రభుత్వం విక్రయించడం, ప్లాట్లు చేసి ఇవ్వడం జరిగిందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. విక్రయించిన భూములను అధికారులు పొరపాటున 22ఏలో చేర్చారన్నారు. అధికారులు చేసిన పొరపాటును యుద్ధప్రాతిపదికన సరిదిద్దుతున్నామని చెప్పారు. నిషేధిత జాబితా నుంచి గతంలోనే తొలగిస్తూ ఇచ్చిన జీవో చూపితే వెంటనే తొలగిస్తున్నామన్నారు. ఒక్కరోజులోనే మ్యుటేషన్ చేయటం వల్ల ఎన్నో అక్రమాలు జరిగాయన్న పొంగులేటి, ధరణి పోర్టల్‌లో 80 మాడ్యూల్స్ పెట్టి పేద రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టారని మండిపడ్డారు. ఇప్పుడు భూభారతి చట్టంలో 80 మాడ్యూల్స్‌కు బదులు కేవలం 5 మాడ్యూల్స్ పెట్టామన్నారు."దొరల పాలనలో పాసుపుస్తకాలు ఉండేవి కానీ, భూములు మాత్రం ఉండేవి కాదు. ధరణి చట్టం తెచ్చి తమ బంధువులు, రాజకీయ అనుచరులకు పాసుపుస్తకాలు ఇచ్చారు. భూమిలేకుండానే ఆ పాసుపుస్తకాలకు కోట్ల రూపాయల రైతుబంధు ఇచ్చారు. భూమిలేని వారికీ రైతుబంధు ఇచ్చి వేలకోట్ల ప్రజాధనం కొల్లగొట్టారు. అసలు అసెంబ్లీ ఇక్కడ నిర్వహిస్తుంటే మాక్ అసెంబ్లీ ఎందుకు అసెంబ్లీకి రాకుండా మాక్ అసెంబ్లీ పెట్టుకుని అక్కడ డ్రామాలు ఆడుతున్నారు.కోట్ల మంది రైతుల వివరాలను విదేశీ సంస్థ అయిన టెరాసిస్ చేతిలో పెట్టారని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చాక, టెరాసిస్ సంస్థను తొలగించి కేంద్ర సంస్థ అయిన ఎన్‌ఐసీకి అప్పగించామన్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం 387 గ్రామాలకు నక్షలు లేవన్నారు. దాదాపు 125 ఏళ్ల



తర్వాత గ్రామాల్లో సమగ్ర భూసర్వే చేపట్టామని పొంగులేటి తెలిపారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన గ్రామాల్లో ఇప్పటికే భూమి మొత్తం సర్వే చేసి రైతులకు పాసుపుస్తకాలు ఇచ్చామని తెలిపారు. వచ్చే ఏడాదిన్నరలోపు రాష్ట్రవ్యాప్తంగా భూసర్వే పూర్తి చేసి రైతులకు మేలు చేస్తామని స్పష్టం చేశారు.ధరణి పోర్టల్‌ను గుప్పిట్లో పెట్టుకొని, గత పాలకులు అర్ధరాత్రి వేళ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలోని 2.49 కోట్ల ఎకరాలను తమ సొంత ఆస్తిలా గత పాలకులు భావించారని ఆక్షేపించారు. ధరణి పోర్టల్‌లో దొర్లిన తప్పులకు లక్షలాది రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పోర్టల్‌లో తప్పుల నమోదు వల్ల వందల సంఖ్యలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్‌కు లాక్ అనే సిస్టమ్ పెట్టి అందరి భూములపై నిఘా పెట్టారన్నారు.

# ఎండపల్లిలో విషాదం పార్టీ మండల అధ్యక్షుడి ఆత్మహత్య



**వెల్గటూర్ సెప్టెంబర్ 12 ( ప్రజా మంటలు ):** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలో విషాద ఘటన చోటుచేసుకుంది.ఎండపల్లి మండల దీ=నా పార్టీ అధ్యక్షుడు సింహాచలం జగన్ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ వేడుకున్నట్లు తెలుస్తోంది. జగన్ అకాల మరణంతో పార్టీ శ్రేణులు, మండలంలో విషాద ఛాయలు అలుము కున్నాయి.ధర్మపురి నియోజకవర్గం లో మంచి గుర్తింపు ఉన్న నాయకులు గా పేరు పొందారు. మంచి నాయకుడిని కోల్పోవడం పట్ల ధర్మపురి నియోజకవర్గ ప్రజలు చాలా బాధ నీ వ్యక్తం చేయడం జరిగింది. మండల అధ్యక్షులు హోదా లో పార్టీ బలోపేతం కోసం చాలా కృషి చేశారు.

# గాంధీ ఆసుపత్రి నూతన సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణికి ఘన సన్మానం



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 12 (ప్రజా మంటలు):** సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి నూతన సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ టి. ఉషారాణిని గాంధీ వైద్య కళాశాల పాలకవర్గం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేసింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ఇందిర నేతృత్వంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్. చంద్రశేఖర్, డాక్టర్ బి.వి. నాగమోహన్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ వేణుగోపాల్‌లు డాక్టర్ ఉషారాణిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డాక్టర్ ఉషారాణి సమర్థ నాయకత్వంలో గాంధీ ఆసుపత్రి పరిపాలనాపరంగా మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పేద రోగులకు మరింత నాణ్యమైన, మెరుగైన ఉచిత వైద్య సేవలు అందేలా ఆసుపత్రి పురోగతి సాధిస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. నూతన బాధ్యతల్లో ఆమె పదవీకాలం విజయవంతంగా కొనసాగాలని, ఆసుపత్రి అభివృద్ధిలో తామంతా పూర్తి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా ప్రతినిధులు పేర్కొన్నారు.

# అంగన్వాడీ కేంద్రం లో అక్షరాబాస్యం కార్యక్రమం



**వెల్గటూర్ సెప్టెంబర్ 12 ( ప్రజా మంటలు ):** వెల్గటూర్ మండలం బీర్ సాని గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం - 2 లో పోషణ మహోత్సవాలలో భాగంగా 3 - 5 సంవత్సరాల పిల్లలకీ అక్షరాబాస్యం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో సర్పంచ్, అంగన్వాడీ టీచర్ ఉద్దేశించి మాట్లాడుతూ సరైన సమయం లో సరైన సమయం లో మంచి పోషకాలు, మీటమిన్స్, ప్రోటీన్స్ ఉండే పాలు పండ్లు, ఆకుకూరలు, పప్పు దినుసులు, చిరు దాన్యాలు కూడిన మంచి ఆహారం తీసుకోవాలి.ఈ కార్యక్రమంలో బాలింతలు,గర్భిణీ మహిళలు,పిల్లల నీ ఉద్దేశించి సర్పంచ్ కారుకూరి శరణ్య - చంద్రశేఖర్ మాట్లాడుతూ సరైన ఆహారం తీసుకుంటేనే వయసుకి తగిన బరువు పెరుగుతారు అని మాట్లాడము జరిగింది. 3 - 5 ఏళ్ల పిల్లలని ప్రైవేట్ స్కూల్ లో పంపించకుండా అంగన్వాడీ కేంద్రం లో నమోదు చేసుకోవాలి అని బాలింతలనీ ఉద్దేశించి అంగన్వాడీ టీచర్ సువర్ణ మాట్లాడం జరిగింది.అలాగే అంగన్వాడీ కేంద్రము లో నిర్వహించే పూర్వ ప్రాథమిక విద్య యొక్క ఆవశ్యకత గురించి వివరించారు. ఈ కార్యక్రమం లో గర్భిణీ మహిళలు, బాలింతలు,పిల్లల తల్లులు,అంగన్వాడీ టీచర్ సువర్ణ సర్పంచ్ కారుకూరి శరణ్య, చంద్రశేఖర్ ఉపసర్పంచ్ రడపాక మల్లేశం,వార్డ్ సభ్యులు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

# అంతిమయాత్రలో పాల్గొని పాడే మోసిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్





**గొల్లపల్లి సెప్టెంబర్ 12 ప్రజా మంటలు :** ఎండపల్లి మండల బిఆర్ స్ పార్టీ తాజా మాజీ మండల అధ్యక్షుడు సింహాచలం జగన్ అకాల మరణ వార్త వినగానే మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తన స్వగృహ గుల్లకోట లో జగన్ భౌతికకాయాన్ని సందర్శించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి అశ్రునయనాలతో నివాళులర్పించారు.బిఆర్ స్ పార్టీ జెండాను జగన్ భౌతిక కాయంపై కప్పి పార్టీ తరఫున అత్యున్నత గౌరవాన్ని ప్రకటించారు.తీవ్ర దుఃఖంలో మునిగిపోయిన కొప్పుల ఈశ్వర్ స్వయంగా జగన్ పాడె మోసి అంతిమ యాత్రలో పాల్గొని భావోద్వేగానికి లోనయ్యారు.ఈ సందర్భంగా జగన్ బిఆర్ఎస్ పార్టీ కి చేసిన సేవలు మరువలేనిదని కొనియాడారు. జగన్ కుటుంబ సభ్యులకు, బంధువులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి టి.జీవన్ రెడ్డి, గాజుల మల్లేశం, బి ఆర్ స్ మండల పార్టీ అధ్యక్షులు వివిధ గ్రామాల పార్టీ నాయకులు కార్యక్తలు యువకలు అంతిమయాత్రలో పాల్గొన్నారు

# ఎంఐఎం చేతుల్లోకి సికింద్రాబాద్

--బీజేపీ నేత గుండగోని భరత్ గౌడ్ విమర్శ..



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 12 (ప్రజా మంటలు):** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకుండా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎంఐఎంకు తొత్తులుగా వ్యవహరిస్తున్నాయని బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్ గౌడ్ మండిపడ్డారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నిజాం మెడలు వంచి 1948 సెప్టెంబర్ 17న తెలంగాణకు విముక్తి కల్పిస్తే, నాడు కేసీఆర్, నేడు రేవంత్ రెడ్డి మాట తప్పి అధికారికంగా నిర్వహించకుండా ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.కేసీఆర్ కుటుంబ పాలన సాగిస్తే, రేవంత్ ప్రభుత్వం అన్నదమ్ములు, మంత్రుల దోపిడీకి తెరతీసిందని భరత్ గౌడ్ విమర్శించారు. పశ్చిమ బెంగాల్ నుంచి వస్తున్న రోహింగ్యాలకు భోలక్‌పూర్, పద్మారావునగర్, మెట్టుగూడ ప్రాంతాల్లో దొంగ ఓట్లు సృష్టిస్తూ, సికింద్రాబాద్‌ను సైతం పాతబస్తీలా మార్చి ఎంఐఎం చేతుల్లో పెట్టేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. సెప్టెంబర్ 17 విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం నుంచి పటేల్ విగ్రహం వరకు భారీ మహిళా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామని, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పేరేడ్ గ్రౌండ్ లో జరిగే ఈ వేడుకలను ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు టి.రాజశేఖర్ రెడ్డి,మేకల సారంగపాణి,రమేష్ రామ్,నగేశ్,ఆనంద్,కనకట్ల హరి,సురేశ్,నవీన్,అశ్విని శ్రీనివాస్ పాల్గొన్నారు.

# బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలు

-వాళ్లను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారు..

-సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్ ధ్వజం



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 12 (ప్రజా మంటలు):** ఓట్ల తొలగింపు లక్ష్యంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, మరోవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ సంక్షేమ పాలనను జీర్ణించుకోలేక బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీని స్తంభింపజేయాలని చూస్తున్నారని సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు దీపక్ జాన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎస్ఐఆర్ (సమ్మరీ రివిజన్) ప్రక్రియను బీజేపీ ప్రభుత్వం ఒక ఆయుధంగా మలుచుకుని, ఎన్నికల కమిషన్‌తో కుమ్మక్కై పెద్ద ఎత్తున ఓట్ల తొలగింపునకు పాల్పడుతోందని దీపక్ జాన్ ఆరోపించారు. సాధారణంగా ఓటర్ల జాబితా సరైనదా.. కాదా.. అని చూసేందుకు జరగాల్సిన ప్రక్రియను.. రాముని ఆలయం తర్వాత కూడా ఎన్నికల్లో గెలిచే మార్గం లేక ఎస్టీలు, మహిళలు, మైనారిటీలు, క్రైస్తవుల ఓట్లను తొలగించడానికి బీజేపీ ఎస్ఐఆర్ ను వాడుకుంటోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏఎస్‌డీ, అన్‌మార్క్డ్, అనోమలీస్ లిస్టుల పేరిట లక్షలాది ఓట్లను తొలగిస్తూ దాదాపు 50 నుంచి 60 శాతం మంది ఓటు హక్కును కాలరాసే ప్రయత్నం జరుగుతోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని, ప్రజల ఓటు హక్కును కాపాడేందుకే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గాల్లో బీఎల్ఏలు, సూపర్‌వైజర్లు, అబ్జర్వర్లను నియమించి అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు.అదేవిధంగా అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్న తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకునేందుకు కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో సమావేశమై అసెంబ్లీని నడవనీయకుండా కుట్ర పన్నారని ఆరోపించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కించపరిచేలా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు, కౌశిక్ రెడ్డి వంటి నేతలు అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. దళితుల ఓట్లతో అధికారం అనుభవించిన కేసీఆర్.. దళిత ముఖ్యమంత్రి, మూడెకరాల భూమి, దళితబంధు హామీలతో ఆ వర్గాన్ని నిలువునా మోసం చేశారని, దళితులు ఫామ్‌హౌస్‌కు వెళ్తే శుద్ధీకరణ పేరిట అవమానించిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని దీపక్ జాన్ విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా ప్రజల పక్షాన కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ముషీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటికి షాక్

-మానస హిల్స్ అక్రమ మైనింగ్‌పై ఎన్‌హెచ్ఆర్సీ తీవ్ర ఆగ్రహం



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 12 (ప్రజా మంటలు):** తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ) నుంచి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పరిధిలోని మానస హిల్స్ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న అక్రమ మైనింగ్ వ్యవహారాన్ని కమిషన్ తీవ్రంగా పరిగణించింది. మంత్రి కుటుంబంతో సంబంధాలున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థపై కేంద్ర స్థాయిలో విచారణ జరిపి, రెండు నెలల్లోగా (ఎనిమిది వారాలు) కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర గనుల శాఖ కార్యదర్శికి ఎన్‌హెచ్ఆర్సీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని మానస హిల్స్ వద్ద ఎటువంటి చట్టబద్ధమైన అనుమతులు, లీజు పత్రాలు లేకుండా రాత్రింబవళ్లు భారీ యంత్రాలతో కొండలను పిండి చేస్తూ అక్రమ క్వారీ నిర్వహిస్తున్నారని ప్రముఖ మానవ హక్కుల న్యాయవాది రామారావు ఇమ్మనేని ఎన్‌హెచ్ఆర్సీకి సమగ్ర ఆధారాలతో ఫిర్యాదు చేశారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ), హెచ్ఎండీఏ, రెవెన్యూ శాఖల అనుమతులు, కనీసం పేలుడు పదార్థాల లైసెన్సులు కూడా లేకుండా యథేచ్ఛగా కొండలను కరిగించేస్తున్నా అధికార యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని ఆయన కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు.ఈ ఫిర్యాదును పరిశీలించిన ఎన్‌హెచ్ఆర్సీ బాధితులు, ఫిర్యాదుదారుడిని భాగస్వామ్యం చేస్తూ తక్షణమే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే తీసుకున్న చర్యల వివరాలను ఫిర్యాదుదారుడైన లాయర్ రామారావుకు అధికారికంగా తెలియజేయాలని స్పష్టం చేసింది. కమిషన్ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ, అక్రమ మైనింగ్‌పై తగిన చర్యలు చేపట్టాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి అధికారికంగా లేఖ రాసింది. ఇదే విషయాన్ని ధ్రువీకరిస్తూ కేంద్ర గనుల శాఖ రామారావుకు అధికారిక సమాచారాన్ని అందించింది.ఇప్పటికే అసెంబ్లీ వేదికగా ప్రతిపక్షాలు రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమాలపై గళమెత్తగా, ఇప్పుడు జాతీయ మానవ హక్కుల కమిషన్ నేరుగా కేంద్ర విచారణకు ఆదేశించడంతో కొండల తవ్వకాల ఫైళ్లు వేగంగా కదులుతున్నాయి. ఈ పరిణామం అటు అధికార వర్గాల్లో, ఇటు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.

# జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణ

- రూ.2.34 కోట్లకు పైగా పరిహారం



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు) సెప్టెంబర్ 12 :** నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని న్యాయస్థానాల పరిధిలో శనివారం మూడవ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి-కమ్-చైర్మన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జగిత్యాల సి. రత్న పద్మావతి మార్గదర్శకత్వంలో ఈ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొదటి అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి సునీత రవీంద్ర రెడ్డి, సీనియర్ సివిల్ జడ్జి సి. నాగేశ్వరరావు, రెండవ అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కె. నికీషా, కార్యదర్శి సరిత పాల్గొన్నారు.ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి అనుకూలమైన వివిధ సివిల్, క్రిమినల్, మోటార్ వెహికల్ యాక్సిడెంట్ క్లెయిమ్, కేసులను కక్షిదారుల పరస్పర అంగీకారంతో పరిష్కరించారు. ముఖ్యంగా మోటార్ వెహికల్ యాక్సిడెంట్ కేసులకు సంబంధించి 19 కేసులను పరిష్కరించి, మొత్తం రూ.2,34,80,000/- పరిహారాన్ని బాధితులకు అందజేశారు.

మొత్తం పరిష్కరించబడిన కేసులు

సివిల్ కేసులు: 34

క్రిమినల్ కేసులు: 2,506

పీ.ఎల్.సీ. కేసులు: 3

మొత్తం కేసులు: 2,543

మొత్తం 2,543 కేసులు పరిష్కరించబడ్డాయి.

# అదొక దైవిక అనుభూతి..థాంక్యూ కేరళం-పవన్ కల్యాణ్ ప్రకటన

గత కొన్ని వారాలుగా కేరళలో ఆయుర్వేద చికిత్స తీసుకున్న పవన్ కల్యాణ్

చికిత్స అనంతరం కేరళ ప్రజలకు, ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు

పలు ప్రాచీన ఆలయాలను సందర్శించి దైవిక అనుభూతి పొందానన్న పవన్

సహకరించిన సీఎం, పోలీస్ యంత్రాంగానికి ప్రత్యేక ధన్యవాదాలు

కేరళ ప్రజల ఆప్యాయత, ఆతిథ్యం తన పర్యటనను ప్రత్యేకంగా మార్చాయని వెల్లడి



ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ గత కొన్ని వారాలుగా కేరళలో ఆయుర్వేద చికిత్స తీసుకున్న సంగతి తెలిసిందే. తన పర్యటన ముగిసిన నేపథ్యంలో, కేరళలో తనకు లభించిన అనుభవాలు, ఆదరణపై ఆయన శనివారం ఓ సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. కేరళ ప్రజల ఆప్యాయత, ఆతిథ్యానికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతూ, తన పర్యటన ఎంతో ప్రశాంతంగా, మధుర జ్ఞాపకాలతో సాగిందని పేర్కొన్నారు.గత కొన్ని వారాలుగా తాను తన చికిత్స కోసం కేరళలో ఉన్నానని పవన్ తెలిపారు. "కేరళ ప్రజలకు పేరుగాంచిన ఆప్యాయత, కరుణ, ఆతిథ్యాన్ని స్వయంగా అనుభవించే అవకాశం నాకు లభించింది. నా చికిత్స సమయంలో ఇక్కడ గడిపిన కాలం నాకు మానసిక స్వస్థతను, శాంతిని, ఎన్నో మధుర జ్ఞాపకాలను అందించింది" అని ఆయన పేర్కొన్నారు. తన చికిత్స విజయవంతం చేయడంలో అంకితభావంతో కూడిన సంరక్షణ, వృత్తి నైపుణ్యం, వ్యక్తిగత శ్రద్ధ కనబరిచిన డాక్టర్ సీతారాం ఆయుర్వేదిక్ రిట్రీట్‌లోని వైద్యులు, యాజమాన్యం, సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమయంలో తనకు అందిన సంరక్షణ, మద్దతుకు తాను ఎంతో రుణపడి ఉంటానని చెప్పారు.ఈ పర్యటనలో భాగంగా పలు పవిత్ర దేవాలయాలను సందర్శించే భాగ్యం కూడా తనకు కలిగిందని పవన్ కల్యాణ్ వివరించారు. "త్రిప్రయార్ శ్రీ రామస్వామి, గురువాయూర్ శ్రీ కృష్ణ, మమ్మియూర్ శ్రీ మహాదేవ, చెట్టికులంగర శ్రీ భగవతి అమ్మ ఆలయాలను సందర్శించాను. శతాబ్దాల నాటి సంప్రదాయాలు, ఆధ్యాత్మిక వారసత్వంతో ముడిపడి ఉన్న ఈ ప్రాచీన ఆలయాలు నాకు గాఢమైన భక్తిని, శాంతిని, ఆత్మపరిశీలనకు అవకాశాన్ని అందించాయి. వాటి కాలాతీతమైన ఆచారాలు, పవిత్ర వాతావరణాన్ని అనుభవించడం నిజంగా దైవికమైనది, సంతృప్తినిచ్చింది. మన ప్రాచీన నాగరికతా వారసత్వానికి కేరళ ఆలయాలు సజీవ రూపాలుగా నిలుస్తాయి" అని ఆయన అభిప్రాయపడ్డారు.తన పర్యటన సాఫీగా సాగేందుకు సహకరించిన కేరళ ప్రభుత్వానికి, గౌరవ ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ కు పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, తన బస ఆసాంతం అవసరమైన ఏర్పాట్లు, సహకారం అందించిన డీజీపీ, కేరళ పోలీసులకు, త్రిస్సూర్, అలప్పుజ, కొచ్చి జిల్లాల పోలీసు బృందాలకు, సంబంధిత జిల్లా యంత్రాంగానికి, స్టేట్ ప్రోటోకాల్ విభాగానికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. వారి వృత్తి నైపుణ్యాన్ని, భద్రతా ఏర్పాట్లను ఆయన ప్రశంసించారు."అన్నింటికంటే ముఖ్యంగా, కేరళ ప్రజల ఆప్యాయత, సద్భావన, అద్భుతమైన ఆతిథ్యానికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. వారి వాత్సల్యం, ఇక్కడి ప్రశాంతమైన, ఆధ్యాత్మిక అనుభవాలు నా పర్యటనను ఎంతో ప్రత్యేకంగా మార్చాయి. కేరళ ప్రజల పట్ల ప్రగాఢమైన కృతజ్ఞత, అపారమైన గౌరవం, మధుర జ్ఞాపకాలతో ఇక్కడి నుంచి బయలుదేరుతున్నాను. థ్యాంక్యూ కేరళం" అని పవన్ తన ప్రకటనలో ముగించారు.

# విద్యే జీవితాన్ని మారుస్తుంది- అసెంబ్లీలో సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు

విద్యతోనే సామాజిక మార్పు సాధ్యమన్న సీఎం

ప్రత్యేక విద్యా కమిషన్ ఏర్పాటు చేశామని వెల్లడి

28,163 ప్రభుత్వ విద్యాసంస్థల్లో 28.77 లక్షల మంది విద్యార్థులున్నట్లు వెల్లడి

ఏడాదిలో 11 వేల టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చినట్లు ప్రకటన

10,600 మంది టీచర్లకు 55 రోజుల్లో నియామక పత్రాలిచ్చినట్లు వెల్లడి



విద్యే జీవితాలను మార్చే శక్తి అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చదువుకు దూరమైతే ఎంత ఆస్తి ఉన్నా సామాజికంగా వెనుకబడే పరిస్థితి ఉంటుందని చెప్పారు. 2024లో నిర్వహించిన సీపెక్ సర్వేలోనూ ఇదే విషయం వెల్లడైందన్నారు. అక్షరం ఒక్కటే మనిషి జీవితాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని స్పష్టం చేశారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా తెలంగాణ విద్యా వ్యవస్థను పూర్తిగా మార్చుతున్నామని అసెంబ్లీలో తెలిపారు.రాష్ట్రంలో విద్యా వ్యవస్థలోని లోపాలను సరిదిద్దేందుకు ప్రత్యేక విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశామని సీఎం చెప్పారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా కొత్త మార్గదర్శకాలు రూపొందించేందుకు కేశవరావు కమిటీని నియమించినట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 28,163 ప్రభుత్వ విద్యాసంస్థల్లో 28.77 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని వివరించారు. వీరికి 1.57 లక్షల మంది సిబ్బంది సేవలు అందిస్తున్నారని చెప్పారు. జెన్ జీతో పాటు జెన్ ఆల్ఫా, జెన్ బీటా తరాల భవిష్యత్తును తరగతి గదుల్లోనే తీర్చిదిద్దుతామని అన్నారు.ఉపాధ్యాయుల నియామకంలో తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లలో 7,857 మంది టీచర్లను మాత్రమే నియమించిందని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 11 వేల టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చామని వెల్లడించారు. ఎలాంటి అవినీతికి అవకాశం లేకుండా 55 రోజుల్లో 10,600 మంది ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందించామని తెలిపారు. రైట్ టు ఎడ్యుకేషన్ ప్రకారం 30 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండాలి, తెలంగాణలో 17 మందికే ఒక ఉపాధ్యాయుడు ఉన్నారని వివరించారు.విద్యా రంగానికి గతంలో తగ్గుతూ వచ్చిన బడ్జెట్ కేటాయింపులను తమ ప్రభుత్వం పెంచుతోందని సీఎం చెప్పారు. అసెంబ్లీ సభ్యులు ఇచ్చిన సూచనలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా తెలంగాణ విద్యార్థులను తయారు చేయడమే లక్ష్యమన్నారు. దేశంలో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలకు పునాదులు వేసిన పండిట్ నెహ్రూ ఆలోచనలతో ముందుకు సాగుతామని తెలిపారు. భవిష్యత్ తరాలకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

ప్రజా మంటలు

ఆదివారం 13 - 09 - 2026

# రాష్ట్రంలో ఇకపై ఏ సేవలు పొందాలన్నా ఆధార్ తప్పనిసరి కాదు ప్రభుత్వం కీలక ఉత్తర్వులు

**రాష్ట్రంలో ఏవైనా సేవలను పొందడానికి ఆధార్ ఇకపై తప్పనిసరి కాదని ప్రభుత్వం ప్రకటించింది.**

**ప్రభుత్వ సేవల కోసం ఆధార్‌ను స్వచ్ఛంద ప్రాతిపదికన స్వీకరించాలని ఆదేశాలు జారీ చేసింది.**




రాష్ట్రంలో ప్రభుత్వ సేవలు, సబ్సిడీలు లేదా లబ్ధి పొందడానికి ఇకపై ఆధార్ కార్డు తప్పనిసరి కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రభుత్వ సేవలకు ఆధార్‌ను కేవలం స్వచ్ఛంద ప్రాతిపదికన మాత్రమే తీసుకోవాలని ఆదేశిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. మీ సేవ కేంద్రాలతో పాటు దివ్యాంగుల సర్టిఫికేట్ల జారీలోనూ ఇదే విధానం వర్తిస్తుందని ప్రభుత్వం తేల్చిచెప్పింది.ఆధార్ లేదని సేవలు నిరాకరిస్తే చర్యలు ప్రభుత్వం జారీ చేసిన తాజా మార్గదర్శకాల ప్రకారం పూర్తి వివరాలు ఇలా ఉన్నాయిస్వచ్ఛంద ప్రాతిపదికన మాత్రమే: ఆర్థిక, ఇతర సబ్సిడీలు, సంక్షేమ ప్రయోజనాలు, సేవల కోసం దరఖాస్తుదారులు స్వచ్ఛందంగా ఇస్తేనే ఆధార్‌ను తీసుకోవాలి.గుర్తింపు నిర్ధారణకు ప్రత్యామ్నాయాలు: 'మీ సేవ' సహా ఇతర సేవల నమోదు సమయంలో లబ్ధిదారుల గుర్తింపు నిర్ధారణకు ఆధార్ కాకుండా ఇతర ప్రత్యామ్నాయ గుర్తింపు కార్డుల గురించి దరఖాస్తుదారునికి తప్పనిసరిగా వివరించాలి.సేవల నిరాకరణ వీల్లేదు: కేవలం ఆధార్ కార్డు ఇవ్వలేదనే కారణంతో ఎలాంటి ప్రభుత్వ సేవలను లేదా సంక్షేమ లబ్ధిని నిరాకరించేందుకు వీల్లేదని ప్రభుత్వం గట్టిగా హెచ్చరించింది.స్వర్ణ గ్రామం, వార్డుల్లో అమలు: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని 'స్వర్ణ గ్రామం', 'స్వర్ణ వార్డుల్లో' ప్రతి చిన్న అంశంలోనూ ఈ కొత్త విధానాన్ని నిరభ్యంతరంగా అమలు చేయాలని ఆదేశించింది.దివ్యాంగుల సర్టిఫికేట్లకు వర్తింపు: వికలాంగులకు జారీ చేసే ప్రత్యేక సర్టిఫికేట్ల ప్రక్రియలో కూడా ఆధార్‌ను బలవంతం చేయకూడదని, పైన పేర్కొన్న విధివిధానాలనే ఖచ్చితంగా పాటించాలని ప్రభుత్వం మరో ప్రత్యేక ఉత్తర్వులో స్పష్టం చేసింది.స్వచ్ఛందంగా వినియోగానికి అనుమతి వైకల్య నిర్ధారణ, ధృవీకరణ పత్రాల జారీ ప్రక్రియలో దరఖాస్తుదారుల ఆధార్ ధృవీకరణను స్వచ్ఛందంగా వినియోగించుకునేందుకు 'మీ-సేవ' కేంద్రాల నిర్వాహకులకు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఆధార్ ధృవీకరణ విఫలమైనప్పటికీ ప్రజలకు సేవలను నిరాకరించకూడదని శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వులు స్పష్టం చేస్తోంది. ప్రత్యామ్నాయ గుర్తింపు పద్ధతుల గురించి వినియోగదారులకు తెలియజేయాలని, అలాగే ఆధార్ వివరాలను సురక్షితంగా ఎన్‌క్రిప్ట్ చేసి భద్రపరచాలని కూడా ప్రభుత్వం ఆదేశించింది.

# నిరుద్యోగులకు గుడ్?న్యూస్ ఉద్యోగాల భర్తీకి 15న ప్రాథమిక నోటిఫికేషన్




ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. ఇందులో భాగంగా ఈ నెల 15వ తే ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. జాబ్ క్యాలెండర్‌లో ప్రకటించిన ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఈ నెల 15వ తేదీన ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రాథమిక (షార్ట్) నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది. పోలీస్ శాఖ మినహా ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేసే మిగతా ఉద్యోగాలకు ఈ ప్రకటన వెలువడనుంది. ఈ నెల 15న రాబోయే షార్ట్ నోటిఫికేషన్‌లో కేవలం పోస్టుల వివరాలు, దరఖాస్తుల స్వీకరణ తేదీలు, పరీక్షల షెడ్యూల్ మాత్రమే ఉంటాయి. సిలబస్, రిజర్వేషన్ రోస్టర్ తదితర వివరాలతో కూడిన పూర్తిస్థాయి నోటిఫికేషన్‌ను అక్టోబరు మొదటి వారంలో విడుదల చేయనున్నారు. అభ్యర్థుల వయోపరిమితికి జులై 1వ తేదీని గీటురాయిగా పరిగణనలోకి తీసుకుంటారు. కొత్తగా చదువు పూర్తి చేసిన అభ్యర్థులు ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో వన్ టైం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇప్పటికే రిజిస్టర్ చేసుకుని అదనపు అర్హతలు సాధించినవారు తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.గ్రూప్-1 జాబితాలో మార్పులు గ్రూప్-1 పోస్టుల జాబితాకు ప్రభుత్వం పలు సవరణలు చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేయడంతో సాంకేతిక సమస్యలు దాదాపు తొలిగిపోయాయి. ఆర్థిక శాఖ ఇటీవల 149 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చింది. అయితే ఆ జాబితాలో వయోజన విద్య సహాయ సంచాలకులు (4), డీఈవో (14) పోస్టులను పేర్కొనలేదు. ఇప్పుడు వాటిని కూడా గ్రూప్-1లో చేర్చడంతో మొత్తం పోస్టుల సంఖ్య 167కు చేరింది.ఇప్పటి వరకు గ్రూప్-1 జాబితాలో ఉన్న ఎంపీడీఓ పోస్టును ఈ జాబితా నుంచి తొలగించారు.జిల్లా పంచాయతీ అధికారి స్థానంలో డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి పోస్టును చేర్చారు.డివిజనల్ అగ్నిమాపక అధికారి పోస్టును జిల్లా అగ్నిమాపక అధికారి (ఢఖీూ-ఫైర్ సర్వీసెస్)గా మార్చారు.వయోజన విద్య అసిస్టెంట్ డైరెక్టర్/ప్రాజెక్టు అధికారి, డీఎస్పీ (కమ్యూనికేషన్స్), డీఈఓ పోస్టులను కొత్తగా గ్రూప్-1 సర్వీసెస్‌లో చేర్చారు.డిప్యూటీ కలెక్టర్, డీఎస్పీ పోస్టులను మల్టీజోన్ పోస్టులుగా మార్పు చేశారు.వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ క్లాస్-ఏ పోస్టులను సైతం ఈసారి ఏపీపీఎస్సీ ద్వారానే భర్తీ చేయనున్నారు.గ్రూప్-1, 2 ఆఫ్‌లైన్‌లో : పరీక్షల నిర్వహణపై ఏపీపీఎస్సీ కీలక నిర్ణయం తీసుకుంది. అత్యంత కీలకమైన గ్రూప్-1, గ్రూప్-2 నియామక పరీక్షలను పాత పద్ధతిలోనే మాన్యువల్‌గా (ఆఫ్‌లైన్) నిర్వహిస్తారు. మిగతా నియామకాలకు మాత్రం ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించాలని యోచిస్తున్నారు. ఆన్‌లైన్ పరీక్షల్లో పేపర్ లీకేజీకి ఆస్కారం ఉండదని ఏపీపీఎస్సీ భావిస్తోంది. ఆన్‌లైన్ పరీక్షలకు నార్మలైజేషన్ అమలు చేసే విషయంపై నిపుణులతో అధ్యయనం చేయిస్తోంది.రాష్ట్రపతి ఉత్తర్వులు-2025 ప్రకారం, రాష్ట్రంలో 26 జిల్లాల ప్రాతిపదికన ఆరు జోన్లు, రెండు మల్టీజోన్ల విధానం అమల్లోకి వచ్చింది. ఈ కొత్త విధానం ప్రకారం ప్రత్యక్ష నియామకాల్లో 95 శాతం ఉద్యోగాలు స్థానికులకే (లోకల్) దక్కుతాయి. మిగతా 5 శాతం పోస్టులను ఓపెన్ కేటగిరి కింద భర్తీ చేస్తారు.

**గ్రూప్-1 పోస్టుల వివరాలు :**

డీఎస్పీ కేటగిరీ-2 (సివిల్)36 డివిజనల్ డెవలప్మెంట్ అధికారి35 సహాయ ఆడిట్ అధికారి14 సహాయ కమిషనర్ (పాత పేరు సీటీఓ)14 జిల్లా విద్యాధికారి (డీఈఓ)14 మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-212 డిప్యూటీ కలెక్టర్11 డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్10 జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి4 వయోజన విద్య అసిస్టెంట్ డైరెక్టర్/ ప్రాజెక్టు అధికారి4 డీఎస్పీ (కమ్యూనికేషన్)3 జిల్లా ఉపాధి కల్పన అధికారి3 ప్రాంతీయ రవాణా అధికారి (ఆర్టీఓ)3 జిల్లా గిరిజన సంక్షేమ అధికారి3 సహాయ ట్రెజరీ/ ఎకౌంట్స్ అధికారి1 మొత్తం పోస్టులు167

# దసరా నుంచి కొత్త పెన్షను ఈ నెల 15 వరకు దరఖాస్తు గడువు

**కొత్త పెన్షన్లు జారీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది.**

**దసరా పండుగ కానుకగా అందించాలని చూస్తోంది.**

**వచ్చే నెల మొదటి వారంలో లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.**



తెలంగాణలో చేయూత పెన్షన్ల పథకం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను ఈ నెలాఖరు వరకు కొనసాగించడంతో పాటు ధ్రువీకరణ పత్రాల జారీకి వెసులుబాట్లు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రక్రియను ఈ సెప్టెంబర్‌లోనే పూర్తి చేసి, కొత్త పెన్షన్లను జారీ చేయాలని ప్రభుత్వం భావించినా, వివిధ కారణాలతో జాప్యం జరుగుతోంది. ఈ మేరకు దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసిన అనంతరం వచ్చే నెల మొదటి వారంలో లబ్ధిదారులను ఎంపిక చేసి దసరా పండుగ నుంచి కొత్త పెన్షన్లను పంపిణీ చేయాలని సర్కారు భావిస్తోంది.

**పరిశీలన సమయంలో అందిస్తే**

ప్రధానంగా దరఖాస్తుదారులు సర్టిఫికెట్లను పొందడం సమస్యగా మారింది. రాష్ట్రంలో 2.5 లక్షల కొత్త పెన్షన్ల మంజూరుకు ప్రభుత్వం అనుమతించిన విషయం తెలిసిందే. దీనికి అనుగుణంగా ఆగస్టు 9 నుంచి సెర్ప్ దరఖాస్తులను స్వీకరించింది. మొదట్లో దరఖాస్తు గడువును ఆగస్టు 31వ తేదీ వరకే విధించింది. నిర్దేశించిన ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తులతో పాటే జత చేయాలన్న నిబంధన ఉండగా, చాలా మంది అర్హులైన వారికి అవి లభ్యం కాలేదు. దీనిని గమనించిన ప్రభుత్వం దరఖాస్తుల గడువును ఈ నెల 15 వరకు పొడిగించింది. అలాగే ధ్రువీకరణ పత్రాలు లేకుండానే దరఖాస్తు చేయాలని, పరిశీలన సమయంలో వాటిని అందిస్తే సరిపోతుందని ప్రభుత్వం సూచించింది.

**ఒంటరి మహిళలకు పెద్ద సమస్య**

దరఖాస్తుదారులకు సంబంధించి ప్రధానంగా ఒంటరి మహిళలు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు పొందడం ప్రస్తుతం పెద్ద సమస్యగా మారింది. నిబంధనల మేరకు గతంలో పెళ్లయి, విడాకులు పొందిన 18 ఏళ్లు దాటిన వారికి విడాకుల పత్రం లేదా కోర్టు ఉత్తర్వులు ఉండాలి అనే నిబంధన పెట్టారు. ఏడాదికి పైగా ఒంటరిగా ఉన్నట్లు తహసీల్దార్ నుంచి విచారణ రిపోర్టు ఉండాలి. మరోవైపు పెళ్లి కాకుండా ఒంటరిగా ఉండే 30 ఏళ్లు (గ్రామాల్లో), 35 ఏళ్లు (పట్టణాల్లో) దాటిన వారు స్థానిక పంచాయతీ సెక్రటరీ లేదా వార్డు ఆఫీసర్ నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. చాలా మంది ఈ సర్టిఫికెట్లు పొందడంలో ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు వితంతువుల విషయంలో భర్త డెత్ సర్టిఫికెట్ పొందడం కూడా తీవ్ర సమస్యగా మారింది.

**ధ్రువీకరణ పత్రాల సమస్యలు**

ఎవరికైనా భర్త మరణిస్తే ఏడాదిలోపు, రెండేళ్లలోపు సర్టిఫికెట్ ఇచ్చే అధికారం తహసీల్దార్లు, ఆర్డీవోలకు ఉంటుంది. అయితే భర్త మరణించి రెండేళ్లు దాటితే ధ్రువీకరణ పత్రం ఎవరు ఇవ్వాలనేది మాత్రం నిబంధనల్లో లేదు. దీంతో చాలా మంది వితంతువులకు సర్టిఫికెట్లు అందడం లేదు. మరోవైపు వివిధ కారణాలతో గీత కార్మికులు, చేనేత కార్మికులు, డయాలసిస్, ఫైలేరియా బాధితులు కూడా ధ్రువీకరణ పత్రాలు పొందడానికి నానా అవస్థలు పడుతున్నారు.ఈ నేపథ్యంలో ధ్రువీకరణ పత్రాల జారీకి వెసులుబాట్లు కల్పించాలని పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ నిర్ణయించింది. ఒంటరి మహిళల కోసం తహసీల్దార్లతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పురపాలక, నగరపాలక సంస్థల్లో మున్సిపల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు కూడా సర్టిఫికెట్లు ఇవ్వాలని ఆదేశిస్తూ శుక్రవారం ఉత్తర్వులను జారీ చేసింది. వితంతువులకు ధ్రువీకరణ పత్రాల జారీలో వెసులుబాటు కోసం ప్రభుత్వ అనుమతి కోరింది.

# ఆర్మీ ఆయుధాల చోరీ కేసు చిన్న ఆధారంతో చిక్కిన నిందితుడు

**ఆర్మీ ఆయుధాల చోరీ కేసులో పోలీసులు వందలాది సీసీటీవీ కెమెరాలు,**

**అనుమానితులు, వేలాది సెల్‌ఫోన్ కాల్ డిటైల్ రిపోర్టు విశ్లేషించారు.**

**10 రోజుల పాటు భిన్న కోణాల్లో పోలీసుల బృందాలు దర్యాప్తులో భాగమయ్యాయి.**



సికింద్రాబాద్ బొల్లారం కంటోన్మెంట్‌లోని మద్రాస్ రెజిమెంట్ 20వ బెటాలియన్‌లో ఆయుధాల చోరీ కేసును హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సవాలుగా తీసుకుని వ్యవహరించారు. మొదట రెండు రోజులు, తర్వాత ఏడు రోజుల్లో పూర్తి చేస్తామని అనుకుంటే పది రోజులకు పైగా దర్యాప్తు పట్టిందని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఈ కేసులో వందలాది సీసీటీవీ కెమెరాలు, అనుమానితులు, వేలాది సెల్‌ఫోన్ కాల్ రికార్డులను విశ్లేషించారు. గతంలో ఆర్మీలో పని చేసి అనారోగ్యం, క్రమశిక్షణ ఉల్లంఘన కింద ఉద్యోగం కోల్పోయిన మాజీ హవల్దార్ ఉప్పుతోళ్ల మల్లేశ్ అలియాస్ రాజును నిందితుడిగా గుర్తించి పోలీసులు అరెస్ట్ చేశారు. గత నెల 31న కేసు నమోదు చేసినప్పటి నుంచి 10 రోజుల పాటు డీజీపీ ఆధ్వర్యంలో పోలీసుల బృందాలు భిన్న కోణాల్లో దర్యాప్తు చేశాయి.

**టెంట్‌లో బస సాంకేతిక ఆధారాల సేకరణ**

ఆయుధాలు అపహరణకు గురైన మద్రాస్ రెజిమెంట్ 20వ బెటాలియన్ వద్ద తాత్కాలికంగా పోలీసులు టెంట్ ఏర్పాటు చేశారు. ఆర్మీ, పోలీసు అధికారులు అక్కడే ఉంటూ కేసు దర్యాప్తు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కంటోన్మెంట్ పరిధిలో నివాసాలు, వ్యాపార సముదాయాలు, పోలీసులు ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ఫుటేజీని చాలా నిశితంగా విశ్లేషించారు. వందల సంఖ్యలో అనుమానితులను ప్రశ్నించారు. రోజూ 10 నుంచి 12 గంటల పాటు అనుమానితులను ప్రశ్నించటం, సాంకేతిక ఆధారాలతో దర్యాప్తును కొనసాగిస్తూ చిన్నపాటి ఆధారంతో కేసును పరిష్కరించారు.

**సాంకేతిక ఆధారాలతో అంచనా**

ఇటీవల సైన్యం నుంచి తొలగించిన వారు, రిటైర్ అయిన సైనికులు, అధికారులతో ఒక లిస్ట్ తయారు చేశారు. గత నెల 30న ఈ చోరీ జరిగిన సమయంలో వీరంతా ఎక్కడున్నారు ఏం చేస్తున్నారు అనే వివరాలను తెలుసుకున్నారు. వారిలో 10 మంది హైదరాబాద్‌లోనే ఉన్నట్టు సాంకేతిక ఆధారాలతో అంచనాకు వచ్చారు. వారిలో మల్లేశ్ మాత్రం ఆగస్టు నెల 28, 29 తేదీల్లో కంటోన్మెంట్ బొల్లారం పరిసర ప్రాంతాల్లో తిరిగినట్టు సెల్‌ఫోన్ సిగ్నల్స్, సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తించారు. అతడి గురించి పూర్తి వివరాలు సేకరించినప్పుడు అసలు విషయం బయటపడింది.

**జంగంరెడ్డిపల్లికి వెళ్లిన టాస్క్‌ఫోర్స్**

క్రమశిక్షణ ఉల్లంఘన చర్యలు, అనారోగ్యం కారణంగా అతడిని ఉద్యోగం నుంచి తొలగించినట్టు గుర్తించారు. ఆ ప్రాంతంపై అతనికి పూర్తి అవగాహన ఉండటం, సైనికుల కోడ్ భాషను ప్రయోగించి ఆయుధాలు ఎత్తుకెళ్లినట్లు అంచనాకు వచ్చారు. నిందితుడి సొంతూరు నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం జంగంరెడ్డిపల్లికి వెళ్లిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు అక్కడ సీసీటీవీ కెమెరాలను పరిశీలించాయి. కారులో అనుమానాస్పదంగా తిరిగినట్టు ఫుటేజీలో గుర్తించారు. మల్లేశ్ అసలు సూత్రధారి అనే నిర్ధారణకు వచ్చారు. మల్లేశ్ భార్య సహకారంతో ఎట్టకేలకు ఆయుధాల ఆచూకీని ఛేదించారు.

**చోరీ వెనుక అసలు కారణం**

ఆయుధాల చోరీ ఎందుకు చేశావని ప్రశ్నించినప్పుడు మల్లేశ్ తనకు హాలీవుడ్ సినిమాలంటే ఇష్టమని, అదే తరహాలో ఆయుధాలు సమకూర్చుకోవాలనే ఉద్దేశంతో ఈ చోరీకి పాల్పడ్డట్లు చెప్పినట్లు తెలిసింది. తనను ఉద్దేశపూర్వకంగానే తొలగించారనే కోపంతో ఇలా చేశానంటూ మరోసారి బదులిచ్చినట్లు తెలిపారు. ఇంత క్లిష్టమైన కేసును ఛేదించడంలో కీలక భాగమైన హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బందిని డీజీపీ సీవీ ఆనంద్, ఇతర ఉన్నతాధికారులు అభినందించారు.

# డ్రైవింగ్ లైసెన్స్ కావాలా.. రెండున్నర గంటల వీడియో కోర్సు పూర్తి చేయాల్సిందే

**తెలంగాణలో డ్రైవింగ్ లైసెన్స్ జారీకి కొత్త నిబంధనలు తప్పనిసరిగా ఆన్‌లైన్ వీడియో కోర్సు పూర్తి చేయాల్సిందే కోర్సు అనంతరం ఆన్‌లైన్ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తేనే లైసెన్స్**

**కూకట్‌పల్లిలో పైలట్ ప్రాజెక్ట్ విజయవంతం త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలు**



తెలంగాణలో ఇకపై డ్రైవింగ్ లైసెన్స్ పొందడం అంత సులువు కాదు. రహదారి భద్రతను పెంచి, ప్రమాదాలను తగ్గించే లక్ష్యంతో రవాణా శాఖ కీలకమైన మార్పులకు శ్రీకారం చుట్టింది. లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకునే వారు ఇకపై తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో రెండున్నర గంటల వీడియో కోర్సు పూర్తి చేసి, ఆ తర్వాత నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఈ కొత్త విధానాన్ని త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు.లెర్నర్ లైసెన్స్ రిజిస్ట్రేషన్ (ఎల్‌ఎల్‌ఆర్) చేసుకున్న ప్రతి ఒక్కరూ ఈ ఆన్‌లైన్ కోర్సులో పాల్గొనాలి. మొత్తం రెండున్నర గంటల నిడివి గల ఈ కోర్సును 25 నిమిషాల చొప్పున 6 మాడ్యూల్స్‌గా విభజించారు. ఇందులో 64 రహదారి భద్రతా నియమాలు, ప్రాక్టికల్ డ్రైవింగ్ పాఠాలు ఉంటాయి. అభ్యర్థి మోసాలకు పాల్పడకుండా ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీతో పర్యవేక్షిస్తారు. ప్రతి మాడ్యూల్ తర్వాత ఒక క్విజ్, మొత్తం కోర్సు పూర్తయ్యాక తుది పరీక్ష ఉంటుంది. ఈ పరీక్షలో పాసైతేనే రెగ్యులర్ డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్ కోసం స్లాట్ బుక్ చేసుకునేందుకు అర్హత లభిస్తుంది.ఇప్పటికే ఈ విధానాన్ని కూకట్‌పల్లి ఆర్టీఏ కార్యాలయంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయగా మంచి ఫలితాలు వచ్చాయి. అక్కడ సుమారు 3,400 మంది ఎల్‌ఎల్‌ఆర్ దరఖాస్తుదారులు ఉండగా, వారిలో 2,800 మంది ఈ కోర్సును పూర్తి చేశారు. ఈ విజయంతో మరో 30 నుంచి 45 రోజుల్లో కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో, ఆ తర్వాత రాష్ట్రమంతటా అమలు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.ఆస్ట్రేలియా, యూకే, అమెరికా వంటి దేశాల్లోని ఉత్తమ విధానాలను స్ఫూర్తిగా తీసుకుని ఈ కోర్సును రూపొందించారు. దీని ద్వారా వాహనదారుల్లో రహదారి నిబంధనలపై పూర్తి అవగాహన కల్పించి, ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ వీడియోలు తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో అందుబాటులో ఉంటాయి.

# హైదరాబాద్‌లో ఆస్తి కొంటున్నారా హైడ్రా కొత్త పోర్టల్‌లో ఎఫ్‌టీఎల్ వివరాలు చెక్ చేసుకోండి

**హైదరాబాద్‌లో హైడ్రా కొత్త వెబ్ పోర్టల్ ప్రారంభం**

**అందుబాటులో చెరువుల పూర్తిస్థాయి నీటిమట్టం, బఫర్ జోన్ వివరాలు**

**వరద ముంపు ప్రాంతాల మ్యాపులు, వర్షపాతం సమాచారం కూడా**

**భూ రికార్డుల కోసం 'భూ భారతి' పోర్టల్‌కు అనుసంధానం**



హైదరాబాద్ పౌరులకు కీలక సమాచారాన్ని ఒకే వేదికపై అందించే దిశగా హైడ్రా కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా శుక్రవారం తన అధికారిక వెబ్‌సైట్/పోర్టల్‌ను ప్రారంభించింది. ఏజెన్సీ కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఈ పోర్టల్‌ను ఆవిష్కరించారు. చెరువులు, వరదలు, భూ రికార్డుల వంటి పలు ముఖ్యమైన సేవలను ఈ పోర్టల్ ద్వారా ప్రజలు సులభంగా పొందవచ్చు.ఈ పోర్టల్ ద్వారా ముఖ్యంగా ఇళ్లు, స్థలాలు కొనుగోలు చేసే వారికి ఎంతో ప్రయోజనం చేకూరనుంది. చెరువులు, ఇతర నీటి వనరుల సమీపంలో ఆస్తులను కొనుగోలు చేసే ముందు వాటి పూర్తిస్థాయి నీటిమట్టం, బఫర్ జోన్ వివరాలను దీని ద్వారా ధ్రువీకరించుకోవచ్చు. ఇందుకోసం హెచ్‌ఎండీఏ లేక్స్ పోర్టల్‌కు నేరుగా యాక్సెస్ కల్పించారు. అలాగే జీహెచ్‌ఎంసీ, సైబరాబాద్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని వరద, నీటి ముంపు ప్రాంతాల ప్రత్యేక మ్యాపులను కూడా ఇందులో పొందుపరిచారు.వీటితో పాటు వాతావరణ సమాచారం, వర్షపాతం వివరాలు, హైదరాబాద్ డాప్లర్ రాడార్ సమాచారం కూడా అందుబాటులో ఉంటాయి. భూ రికార్డుల కోసం తెలంగాణ ప్రభుత్వ 'భూ భారతి' పోర్టల్‌కు నేరుగా లింక్ ఇచ్చారు. దీని ద్వారా సర్వే నంబర్ లేదా పట్టాదారు వివరాలతో భూ సమాచారాన్ని తెలుసుకోవచ్చు. హైడ్రా చేపడుతున్న చెరువుల పునరుద్ధరణ పనుల పురోగతి, ఫొటోలు, వీడియోలను కూడా ఈ పోర్టల్‌లో వీక్షించవచ్చు. ఏజెన్సీ అధికారిక ప్రకటనలు, అత్యవసర సహాయ సమాచారం కూడా ఇందులో లభిస్తాయి.

# ఏపీలో మద్యం దుకాణాల లైసెన్సుల గడువు పొడిగింపు

**మద్యం షాపుల లైసెన్సులు మరో ఏడాదికి పొడిగింపు రెన్యువల్ కాని దుకాణాలకు లాటరీ ద్వారా కేటాయింపు అక్రమ మద్యంపై సమాచారమిస్తే రూ. లక్ష రివార్డు అన్ని షాపుల్లో సీసీ కెమెరాలు, ఏఐ పర్యవేక్షణ తప్పనిసరి**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని మద్యం దుకాణాల లైసెన్సులకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. 2026-27 ఎక్సైజ్ విధానంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 3,736 మద్యం దుకాణాల లైసెన్సుల గడువును మరో ఏడాది పాటు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పొడిగింపు నిర్ణయం అక్టోబర్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానుంది.ప్రస్తుత లైసెన్సుదారులు తమ అనుమతులను పునరుద్ధరించుకునేందుకు (రెన్యువల్) ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఎవరైనా లైసెన్సులను పునరుద్ధరించుకోని పక్షంలో, ఆయా దుకాణాలను లాటరీ పద్ధతి ద్వారా కొత్తవారికి కేటాయిస్తారు. ఈ లాటరీ ప్రక్రియలో పాల్గొనాలనుకునే వారు దరఖాస్తు రుసుము కింద తిరిగి చెల్లించబడని (నాన్-రిఫండబుల్) రూ. 3 లక్షలను చెల్లించాల్సి ఉంటుంది.కొత్త పాలసీలో భాగంగా ప్రభుత్వం నిఘా వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేసింది. ప్రతి మద్యం దుకాణంలోనూ తప్పనిసరిగా నాలుగు సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. నిబంధనల ఉల్లంఘనలను నిశితంగా పరిశీలించేందుకు 24 గంటల పాటు పనిచేసే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థను ప్రభుత్వం అమలు చేయనుంది.మరోవైపు, అక్రమ మద్యం తయారీ, విక్రయాలకు సంబంధించిన సమాచారం అందించిన వారికి ప్రభుత్వం రూ. లక్ష వరకు రివార్డును ప్రకటించింది. ఈ నూతన విధానం ద్వారా మద్యం అమ్మకాలపై పూర్తిస్థాయి నియంత్రణ సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది.

# అప్పుడు సత్కారాలు.. ఇప్పుడు వేధింపులా క్రీడాకారుల ఉద్యోగాలపై వివాదం



క్రీడా కోటాలో ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన వారిపై వైసీపీ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని టీడీపీ ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి ఆరోపించారు. కడపలో మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ.. అర్హులైన క్రీడాకారులను నకిలీలంటూ ముద్ర వేస్తూ, వారి జీవితాలతో వైసీపీ చెలగాటమాడుతోందని మండిపడ్డారు.గతంలో వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో స్వయంగా అందజేసిన అవార్డులు, నగదు బహుమతులు, ప్రభుత్వం జారీ చేసిన జీవోలనే ఇప్పుడు నకిలీవని పేర్కొనడం హాస్యాస్పదమని అన్నారు. ఈ సందర్భంగా పలువురు క్రీడాకారుల అసలు ధ్రువీకరణ పత్రాలు, పతకాలు, అందుకు సంబంధించిన ఫొటోలను మీడియా ముందు ప్రదర్శించారు.జాతీయ స్థాయిలో 40కి పైగా పతకాలు సాధించిన సాఫ్ట్‌బాల్ క్రీడాకారుడు శివాజీనాయక్‌కు గతంలో అప్పటి మంత్రి రోజా చేతుల మీదుగా రూ. 3 లక్షల నగదు బహుమతి అందుకున్నారని చెప్పారు. అలాగే, ఖో-ఖో క్రీడాకారుడు రామ్మోహన్‌ను నాటి ముఖ్యమంత్రి జగన్ స్వయంగా సత్కరించారని తెలిపారు. వీరితో పాటు హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు వీరాంజనేయులు, వాలీబాల్‌లో నాగరాణి, ఖో-ఖోలో కావేరి వంటి ఎందరో ప్రతిభావంతులు వివిధ విశ్వవిద్యాలయాలకు ప్రాతినిధ్యం వహించి, టెట్‌లో ఉత్తమ మార్కులు సాధించి ఉద్యోగాలకు ఎంపికయ్యారని వివరించారు.గ్రూప్-1 పరీక్షల్లో జరిగిన అక్రమాలు వెలుగులోకి వస్తాయనే భయంతోనే, ప్రజల దృష్టిని మళ్లించేందుకు వైసీపీ డీఎస్సీ క్రీడా కోటా నియామకాలపై అనవసర వివాదాలను సృష్టిస్తోందని రాంగోపాల్ రెడ్డి విమర్శించారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com